ఎంఎల్‌ఆర్‌ఐటీ కళాశాలలో మేడే



కార్మికులకు బహుమతులు అందజేస్తున్న ఎంఎల్‌ఆర్‌ఐటీ కళాశాల చైర్మన్ మర్రి లక్ష్మారెడ్డి

దుండిగల్: మేడేను పురస్కరించుకుని దుండిగల్ ఎంఎల్‌ఆర్‌ఐటీ కళాశాలలో బుధవారం ఉత్సవాలు నిర్వహించారు. ఈ సందర్భంగా కళాశాల చైర్మన్ మర్రి లక్ష్మణ్‌రెడ్డి, ప్రిన్సిపాల్ డాక్టర్ శ్రీనివాస్ రావులు కళాశాలలో పనిచేసే కార్మికులకు బహుమతులు అందజేసి మేడే శుభాకాంక్షలు తెలిపారు. ఈ కార్యక్రమంలో హెచ్‌ఓడీలు గుప్తా, బలరామ్, ఏవో గణేష్ తదితరులు పాల్గొన్నారు.

న్యూ ఎరా హైస్కూల్ విజయకేతనం



10/10 జీపీఏ సాధించిన విద్యార్థులతో ఉపాధ్యాయులు

ఆల్విన్‌కాలనీ: పదో తరగతి ఫలితాల్లో కూకట్‌పల్లి, వివేకానందనగర్‌లోని న్యూ ఎరా హైస్కూల్ విద్యార్థులు ప్రతిభ కనబరిచారు. 23 మంది విద్యార్థులకు 10/10జీపీఏ సాధించి కూకట్‌పల్లి పరిసర ప్రాంతాల్లో టాప్ స్కూల్‌లో ఒకటిగా నిలిచిందని కరస్పాండెంట్ వేణుగోపాల్‌రెడ్డి తెలిపారు. అదే విధంగా 9.8 గ్రేడ్లు సాధించిన విద్యార్థులు 13 మంది, మొత్తం 260 మంది పరీక్షకు హాజరు కాగా అందులో 130 మంది విద్యార్థులు గ్రేడ్‌పాయింట్లు 9.0 పైన సాధించారు. ఫలితాల్లో ఉత్తమ ప్రతిభ కనబరిచిన విద్యార్థులను స్కూల్ యాజమాన్యం సత్కరించి అభినందనలు తెలిపారు. ఈ విజయానికి కారకులైన ఉపాధ్యాయులు, తల్లిదండ్రులను అభినందించారు. ఈ కార్యక్రమంలో ప్రధానోపాధ్యాయురాలు అపర్ణ, అకడమిక్ డైరెక్టర్ వంశీ, విద్యార్థులు పాల్గొన్నారు.

ఫస్ట్ ఎయిడ్‌పై అవగాహన



నిజాంపేట్: లైఫ్ చారిటబుల్ ట్రస్ట్, జన విజ్ఞాన వేదిక ఆధ్వర్యంలో హోలిస్టిక్ హాస్పిటల్ సౌజన్యంతో మేడే పురస్కరించుకుని బుధవారం ప్రగతినగర్‌లోని సుందరయ్య భవన్‌లో డాక్టర్ సూర్యతేజరుద్రరాజుతో ఫస్ట్ ఎయిడ్, సరైన పద్ధతులు అనే అంశంపై నిజాంపేట్ మున్సిపల్ కార్పొరేషన్ కార్మికులకు అవగాహన కార్యక్రమం నిర్వహించారు. ఈ కార్యక్రమంలో ఫస్ట్ ఎయిడ్‌లో మనం తీసుకోవాల్సిన జాగ్రత్తలు, హార్ట్ ఎటాక్ వచ్చినప్పుడు సీపీఆర్ ఏ విధంగా చేయాలి, యాక్సిడెంట్‌లో ఫస్ట్ ఎయిడ్ విధానం, స్ట్రోక్ వచ్చినప్పుడు జాగ్రత్తలు తదితర అంశాలపై అవగాహన కల్పించారు. ఎమర్జెన్సీ మెడిసిన్ టెక్నీషియన్ లు హరిబాబు, భీమేష్ సహాయకులుగా వ్యవహరించారు. ఈ కార్యక్రమానికి ముఖ్యఅతిథిగా కార్పొరేటర్ వెంకట రామయ్య పాల్గొనగా జనవిజ్ఞాన వేదిక నాయకులు మల్లయ్య చారి, శంకర్ రావు, లైఫ్ చారిటబుల్ ట్రస్ట్ చైర్మన్ డాక్టర్ ప్రశాంత్ కుమార్, మల్లేష్, బాలపీర్, రాజేశ్వరరావు, సమ్మర్ క్యాంప్ విద్యార్థులు, వారి తల్లిదండ్రులు పాల్గొన్నారు.

చిన్నారి అదృశ్యం

సుభాష్‌నగర్: ఇంటి ముందు ఆడుకుంటున్న చిన్నారి అదృశ్యమైన ఘటన సూరారం పోలీస్‌స్టేషన్ పరిధిలో చోటు చేసుకుంది. పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం.. సూరారం పాండు బస్తీకి చెందిన పర్వీన్ బేగం, ఖైరత్ అలీ భార్యాభర్తలు. వీరికి ఐదుగురు కుమార్తెలు, ఒక కుమారుడు ఉన్నారు. కాగా పర్వీన్ తన చిన్న కుమార్తె సనా(07)ను జహీరాబాద్‌లోని తన చెల్లెలు వద్ద చదివిస్తోంది. ఇటీవల రంజాన్ పండుగ నేపథ్యంలో చిన్న కుమార్తెను పాండు బస్తీకి తీసుకువచ్చింది. గత నెల 28న రోజు మాదిరిగానే పనికి వెళ్లిన పర్వీన్ సాయంత్రం ఇంటికి వచ్చి చూడగా సనా కనిపించలేదు. కాగా గతంలో సైతం తన కుమార్తె రెండు, మూడు సార్లు ఇంటి నుంచి వెళ్లి మరుసటి రోజు తిరిగి వచ్చిందన్నారు. కానీ ఈసారి రాలేదని చిన్నారి తల్లి పోలీసులకు ఇచ్చిన ఫిర్యాదు పేర్కొంది. ఈ మేరకు సూరారం పోలీసులు కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేస్తున్నారు.



జెండా ఎగురవేస్తున్న ఐఎన్‌టీయూసీ నాయకుడు చింతల నాగరాజు



మేడే వేడుకల్లో కార్మిక నేత, శ్రమశక్తి అవార్డు గ్రహీత ముద్దాపురం మదన్‌గౌడ్

ఘనంగా మేడే వేడుకలు

కుత్బుల్లాపూర్ నియోజకవర్గ వ్యాప్తంగా మే డే ఉత్సవాలు ఘనంగా జరిగాయి. జీడిమెట్ల, గాంధీనగర్, దూలపల్లి, గండిమైసమ్మ పారిశ్రామికవాడల్లో వివిధ సంఘాలు, ప్రజాప్రతినిధులు, రాజకీయ నాయకులు ఈ వేడుకల్లో పాల్గొని జెండాలను ఎగురవేసి కార్మికులకు శుభాకాంక్షలు తెలియజేశారు. మేడే స్ఫూర్తిగా కార్మిక లోకం నిరంతరం తమ హక్కులను సాధించుకోవాలని వక్తలు సూచించారు. – కుత్బుల్లాపూర్





నిజాంపేట్‌లో మేడే ఉత్సవాల్లో పాల్గొన్న మేయర్ కొలన్ నీలారెడ్డి



జీడిమెట్ల పారిశ్రామికవాడలో వేడుకల్లో పాల్గొన్న ఎమ్మెల్యే వివేకానంద్



గండిమైసమ్మలోని గ్లాండ్ ఫార్మా పరిశ్రమలో జెండా ఎగురవేస్తున్న మాజీ ఎమ్మెల్యే కూన శ్రీశైలంగౌడ్



దూలపల్లి చౌరస్తాలో ఐఎన్‌టీయూసీ నాయకులు

వైభవంగా ప్రత్యంగిరదేవి ఆలయ వార్షికోత్సవం



శ్రీలక్ష్మీ ప్రత్యంగిరదేవిని దర్శించుకున్న రాగిడి లక్ష్మారెడ్డి, ఎమ్మెల్యే వివేకానంద్

నిజాంపేట్: నిజాంపేట్ కార్పొరేషన్ బాచుపల్లిలోని ఐశ్వర్యాంబిక తపోవనంలో బుధవారం శ్రీలక్ష్మీ ప్రత్యంగిరదేవి ఆలయ వార్షికోత్సవం ఘనంగా జరిగింది. ఈ సందర్భంగా దేవానంద స్వామి, శ్రీశక్త్యానందగిరి స్వామిల ఆధ్వర్యంలో పూజా కార్యక్రమాలు నిర్వహించగా బీఆర్‌ఎస్ మల్కాజిగిరి ఎంపీ అభ్యర్థి రాగిడి లక్ష్మారెడ్డి, ఎమ్మెల్యే వివేకానంద్ పాల్గొన్నారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ... శక్తి స్వరూపిని అయిన అమ్మవారిని దర్శించడం ద్వారా మానసిక ప్రశాంతతో పాటు అష్టైశ్వర్యాలు చేకూరుతాయన్నారు. బీఆర్‌ఎస్ పార్టీ నిజాంపేట కార్పొరేషన్ అధ్యక్షుడు రంగరాయ ప్రసాద్, కార్పొరేటర్లు ఆగం రాజు, బాలాజీ నాయక్, రవికిరణ్, సోమేష్ యాదవ్, పుప్పాల భాస్కర్ తదితరులు ఉన్నారు.

'నీ ఓటు.. నీ భవిష్యత్'



ప్రతిజ్ఞ చేయిస్తున్న ఎన్నికల అధికారి సైదులు

- ఓటింగ్ శాతం పెంపుపై అవగాహన
- ప్రతి ఒక్కరూ ఓటు వేయాలి

సుభాష్‌నగర్: లోక్‌సభ ఎన్నికల్లో ఓటింగ్ శాతాన్ని పెంచాలని కుత్బుల్లాపూర్ అసిస్టెంట్ ఎన్నికల రిటర్నింగ్ అధికారి సైదులు అన్నారు. సుభాష్‌నగర్ డివిజన్ సూరారం కాలనీలోని లూయిబ్రెయిలీ భవన్‌లో బుధవారం ఎస్‌వీఈఈపీ ఆధ్వర్యంలో 'నీ ఓటు నీ భవిష్యత్'అనే పేరిట ఓటింగ్ శాతం పెంచడంపై ఆయా శాఖల అధికారులతో అవగాహన సదస్సు నిర్వహించారు.

◆ ఈ సందర్భంగా అధికారి సైదులు మాట్లాడుతూ.. ప్రతి ఒక్కరూ తమ ఓటు హక్కు వినియోగించుకునే విధంగా ఓటరుకు తెలియపరచి ఓటింగ్ శాతాన్ని పెంచాలన్నారు. 18 సంవత్సరాలు పూర్తి చేసుకుని ఓటు హక్కు పొందిన ప్రతి ఒక్కరూ సమాజ నిర్మాణంలో పాలుపంచుకోవాలన్నారు.

◆ ఎలాంటి ప్రలోభాలకు లోనూ కాకుండా నిజాయితీగా ఓటు వేయాలన్నారు. ఓటు హక్కు వినియోగించుకోకపోతే ప్రశ్నించే అధికారం ఉండదని.. ప్రతి ఒక్కరూ బాధ్యతగా ఓటును వినియోగించుకోవాలన్నారు. అనంతరం అధికారులతో ప్రతిజ్ఞ చేయించారు.

సీఎం రేవంత్‌రెడ్డి సభను విజయవంతం చేయాలి



సమావేశమైన ఎమ్మెల్సీ మహేందర్‌రెడ్డి, కూన శ్రీశైలంగౌడ్, ఇన్‌చార్జి హన్మంతరెడ్డి

కుత్బుల్లాపూర్: లోక్‌సభ ఎన్నికల నేపథ్యంలో మల్కాజిగిరి కాంగ్రెస్ ఎంపీ అభ్యర్థి సునీతామహేందర్‌రెడ్డికి మద్దతుగా గురువారం షాపూర్‌నగర్ చౌరస్తాలో సీఎం రేవంత్‌రెడ్డి ఎన్నికల ప్రచారం నిర్వహించనున్నారు. ఈ నేపథ్యంలో బుధవారం షాపూర్‌నగర్‌లో మాజీ ఎమ్మెల్యే కూన శ్రీశైలంగౌడ్, కాంగ్రెస్ పార్టీ నియోజకవర్గ ఇన్‌చార్జ్ కొలన్ హన్మంత్‌రెడ్డి, టీపీసీసీ ప్రధాన కార్యదర్శి భూపతిరెడ్డిల ఆధ్వర్యంలో ముఖ్య నాయకుల సమావేశమయ్యారు.

◆ ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ.. సాయంత్రం 5గంటలకు షాపూర్‌నగర్ చౌరస్తాలోని వైఎస్సార్ విగ్రహం నుంచి రేవంత్‌రెడ్డి ర్యాలీ మొదలై రాయల్ సాగర్ రెస్టారెంట్ వద్ద రోడ్ షో ఉంటుందన్నారు. ఈ సభను విజయవంతం చేసేందుకు కాంగ్రెస్ కార్యకర్తలు, నాయకులు సమష్టిగా పని చేయాలన్నారు. అనంతరం ఎన్నికల ప్రచారం జరిగే ప్రాంతంలో ఏర్పాట్లను కాంగ్రెస్ నాయకులు శ్రీశైలంగౌడ్, ఎమ్మెల్సీ పట్నం మహేందర్‌రెడ్డి, టీపీసీసీ ప్రధాన కార్యదర్శి జ్యోత్స్న శివారెడ్డి, ఇన్‌చార్జి రమేష్‌రెడ్డి, శోభారాణి పరిశీలించారు.

టెన్త్ ఫలితాల్లో సత్తాచాటిన విద్యార్థులు



విద్యార్థులను అభినందిస్తున్న యూనిక్ స్కూల్ కరస్పాండెంట్ శివయ్య, హెచ్‌ఎం నాగబూషణం

కుత్బుల్లాపూర్: పదో తరగతి ఫలితాల్లో చింతల్, సూర్యనగర్‌లోని యూనిక్ స్కూల్ విద్యార్థులు విజయఢంకా మోగించారు. గత నాలుగు సంవత్సరాలు మాదిరిగానే ఈ ఏడాది కూడా కుత్బుల్లాపూర్ నియోజకవర్గ పరిధిలో మొదటి స్థానంలో నిలిచింది. మొత్తం 147 మంది పరీక్షలు రాయగా 146 మంది పాసయ్యారు. 22 మంది విద్యార్థులు 10/10 జీపీఏ సాధించగా 9కి పైగా జీపీఏ 93 మంది విద్యార్థులు సాధించారు. ఉత్తమ ఫలితాలు సాధించిన విద్యార్థులను, వారిని ప్రోత్సహించిన ఉపాధ్యాయులను మంగళవారం పాఠశాలలో కరస్పాండెంట్ పి.శివయ్య, హెచ్‌ఎం నాగబూషణం ప్రత్యేకంగా అభినందించారు. ప్రతి సంవత్సరం తమ పాఠశాల విద్యార్థులు ఉత్తమ ప్రతిభ కనబరుస్తున్నారని శివయ్య తెలిపారు.

నేతాజీ స్కూల్ విద్యార్థుల అద్భుత ఫలితాలు..

భాగ్యనగర్ కాలనీలోని నేతాజీ స్కూల్ విద్యార్థులు పదో పరగతి ఫలితాల్లో మంచి ఫలితాలు సాధించారు. ఎస్.ధరణి, సాయిచరణ్, సంజన యాదవ్ లు 10/10 జీపీఏ సాధించగా అన్నపూర్ణ కుమారి, హసినీ, ఖలీల, సోనికలు 9.8, రాఘవేంద్ర, పియూష్‌లు 9.7లతో పాటు దాదాపు 30 మంది విద్యార్థులు 9కు పైగా జీపీఏ సాధించారు. వీరిని ప్రిన్సిపాల్ చింతల మహేష్, అకాడమిక్ డైరెక్టర్ నందిని అభినందించారు.



అభినందిస్తున్న నేతాజీ స్కూల్ ప్రిన్సిపాల్ చింతల మహేశ్, అకాడమిక్ డైరెక్టర్ నందిని

ఆరు గ్యారంటీలు అమలుకు నోచుకోవడం లేదు



సమావేశంలో మాట్లాడుతున్న మల్కాజ్‌గిరి బీజేపీ అభ్యర్థి ఈటల రాజేందర్

కుత్బుల్లాపూర్: దేశ ప్రజలకు కరోనా సమయంలో ఉచిత వ్యాక్సిన్లను అందించిన ఘనత ప్రధాని నరేంద్రమోదీకే దక్కుతుందని... దేశానికి సేవ చేసే నాయకత్వాన్నే ప్రజలు కోరుకుంటున్నారని... స్కామ్‌ల పార్టీలను కాదని మల్కాజ్‌గిరి బీజేపీ అభ్యర్థి ఈటల రాజేందర్ అన్నారు. బుధవారం గాజులరామారంలో కార్పొరేటర్ రావుల శేషగిరి ఆధ్వర్యంలో భారీ ఎత్తున వివిధ పార్టీల నాయకులు బీజేపీ చేరారు. ఈ సందర్భంగా ఆయన వారికి బీజేపీ కండువాలు కప్పి పార్టీలోకి ఆహ్వానించారు. అనంతరం ఈటల మాట్లాడుతూ... కాంగ్రెస్ ప్రభుత్వం ప్రకటించిన ఆరు గ్యారంటీలు అమలుకు నోచుకోవడం లేదన్నారు. ఇప్పటి వరకు ఉచిత ఆర్టీసీ బస్సు సదుపాయం తప్ప మిగతా వాటిని సీఎం రేవంత్‌రెడ్డి గాలికొదిలేశారని విమర్శించారు. హామీలు నెరవేర్చని కాంగ్రెస్ నాయకులకు ప్రజలను ఓట్లు అడిగి హక్కు లేదన్నారు.

◆ కరోనా విపత్కర పరిస్థితుల్లో ప్రధాని మోదీ పేదలు ఆకలితో అలమటించకూడదని ప్రతి మనిషికి ఐదు కిలోల చొప్పున రేషన్ ఇచ్చారన్నారు. పథకాన్ని నేటికి కొనసాగిస్తున్నారని తెలిపారు. దేశ వ్యాప్తంగా మహిళల ఆత్మగౌరవాన్ని కాపాడేందుకు 12 కోట్ల టాయిలెట్లను కేంద్రంలోని బీజేపీ ప్రభుత్వం కట్టించిందని తెలిపారు. జన్‌ధన్ ద్వారా 50 కోట్ల మంది పేదలకు బ్యాంకు అకౌంట్లు ఓపెన్ చేయించారన్నారు.

◆ ఆయుష్మాన్ భారత్ పథకం ద్వారా పేదలకు ఐదు లక్షల రూపాయల వరకు ఉచిత వైద్య సదుపాయం కల్పించారని తెలిపారు. ప్రమాదవశాత్తూ చనిపోతే రూ.4లక్షలు, ఆరోగ్య సమస్యలతో చనిపోతే రూ.2లక్షల ఇన్సురెన్స్ కల్పించారని తెలిపారు. దేశంలో శాంతి భద్రతలు ఉండాలన్నా... ఆర్థికంగా దేశం పటిష్టంగా ఉండాలన్నా బీజేపీనే గెలిపించాలన్నారు. గతంలో రాష్ట్ర వైద్యారోగ్యశాఖ మంత్రిగా కరోనా సమయంలో తాను ప్రజలకు అండగా నిలిచానని తెలిపారు. ప్రభుత్వ పాఠశాలల్లో సన్న బియ్యం అందించేలా కృషి చేశానన్నారు. మల్కాజ్‌గిరిలో తనను ఎంపీగా గెలిపించాలని కోరారు. బీజేపీ రాష్ట్ర మాజీ ఉపాధ్యక్షుడు మల్లారెడ్డి తదితరులు పాల్గొన్నారు.

బీఆర్‌ఎస్ ఎంపీ అభ్యర్థి రాగిడి లక్ష్మారెడ్డిని గెలిపించాలి



నిజాంపేట్: కుత్బుల్లాపూర్ నియోజకవర్గంలో అభివృద్ధిని కొనసాగించడానికి బీఆర్‌ఎస్ ఎంపీ అభ్యర్థి రాగిడి లక్ష్మారెడ్డిని గెలిపించాలని ఎమ్మెల్సీ, మేడ్చల్ జిల్లా బీఆర్‌ఎస్ అధ్యక్షుడు శంభీపూర్ రాజు కోరారు. బుధవారం నిజాంపేట్ కార్పొరేషన్ ప్రగతినగర్‌లో లక్ష్మారెడ్డికి మద్దతుగా శంభీపూర్ రాజు ఇంటింటి ప్రచారం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ... పదేళ్ల బీఆర్‌ఎస్ పాలనలో జరిగిన అభివృద్ధే తమ పార్టీ అభ్యర్థిని గెలిపిస్తుందన్నారు. వంద రోజుల కాంగ్రెస్ పాలనలో అభివృద్ధిని ఆటకెక్కించారన్నారు. ఎన్నికల హామీలను నెరవేర్చని కాంగ్రెస్‌కు లోక్‌సభ ఎన్నికల్లో ప్రజలు తగిన గుణపాఠం చెబుతారన్నారు.

రోడ్డు ప్రమాదంలో ఎంబీఏ విద్యార్థి మృతి

దుండిగల్: కళాశాల బస్సు ఢీకొట్టడంతో ఓ ఎంబీఏ విద్యార్థికి తీవ్ర గాయాలై అక్కడికక్కడే మృతి చెందిన దుండిగల్ పోలీస్‌స్టేషన్ పరిధిలో చోటు చేసుకుంది. పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం.. అమీన్‌పూర్ మున్సిపాలిటీ బీరంగూడకు చెందిన శివానంద్ (22) కండ్లకోయలోని సీఎంఆర్ కళాశాలలో ఎంబీఏ ద్వితీయ సంవత్సరం చదువుతున్నాడు. రోజు మాదిరిగానే బుధవారం బైక్‌పై కళాశాలకు వెళ్లిన అతను ఇంటికి తిరుగు ప్రయాణమయ్యాడు. ఓఆర్ఆర్ సర్వీసు రోడ్డు మీదుగా వస్తుండగా దుండిగల్ డబుల్‌బెడ్‌రూమ్ ఇళ్ల చౌరస్తాలో ఎంఎల్‌ఆర్‌ఐటీ కళాశాలకు చెందిన బస్సు బైక్‌ను ఢీకొట్టింది. ఈ ప్రమాదంలో తీవ్రగాయాలైన శివానంద్ ఘటనా స్థలంలోనే మృతి చెందాడు. మృతుడి కుటుంబ సభ్యులు ఇచ్చిన ఫిర్యాదు మేరకు పోలీసులు కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేస్తున్నారు.

తల్లిని గాయపరిచిన కుమారుడికి జైలు

జగద్గిరిగుట్ట: తల్లిని గాయపరిచిన ఘటనలో కుమారుడికి కూకట్‌పల్లి మెట్రోపాలిటన్ కోర్టు జైలు శిక్షతో పాటు జరిమానా విధించింది. జగద్గిరిగుట్ట పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం.. జగద్గిరిగుట్ట అంజయ్యనగర్‌కు చెందిన పరశురాములు, ఉమాదేవిలకు ఇద్దరు కుమారులు, ఒక కుమార్తె కాగా పెద్దకుమారుడు అనీల్‌కుమార్(36)కు పెళ్లై వేరే కాపురం ఉంటున్నాడు. కాగా 2017 మే 29న మద్యం మత్తులో అనీల్‌కుమార్ తల్లిదండ్రుల ఇంటికి వచ్చాడు. అయితే ఇంటి వద్ద ఉన్న తల్లి ఉమాదేవిని తండ్రి ఎక్కడని అడుగగా బయటకు వెళ్లాడని చెప్పింది. దీంతో కోపోద్రిక్తుడైన అనీల్‌కుమార్ ఎలక్ట్రికల్ మీటర్‌ను పగులగొట్టేందుకు యత్నించాడు. దీనిని అడ్డుకోబోయిన తల్లిని పక్కకు నెట్టివేయడంతో ఆమె చేతికి, తలకు బలమైన గాయాలయ్యాయి. ఈ విషయమై అప్పట్లో జగద్గిరిగుట్ట పోలీసులు 389, 324 సెక్షన్ల కింద కేసు నమోదు చేశారు. దర్యాప్తులో భాగంగా బుధవారం కూకట్‌పల్లి మెట్రోపాలిటన్ కోర్టులో నిందితుడిని ప్రవేశపెట్టగా అతనికి ఒక సంవత్సరం సాధారణ జైలు జీవితంతో పాటు రూ.3వేల జరిమానా విధిస్తూ జడ్జి తీర్పు ఇచ్చారని పోలీసులు తెలిపారు.

వృద్ధుడి అదృశ్యం

సుభాష్‌నగర్: ఇంటి నుంచి బయటకు వెళ్లిన వృద్ధుడు అదృశ్యమైన ఘటన సూరారం పోలీస్‌స్టేషన్ పరిధిలో చోటు చేసుకుంది. పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం.. కైసర్‌నగర్‌కు చెందిన హాజీ (58) గత నెల 30న పక్క గల్లీలో ఉండే మెకానిక్ షెడ్డుకు వెళ్తున్నానని చెప్పి రాత్రైనా ఇంటికి తిరిగి రాలేదు. దీంతో ఆందోళన చెందిన కుటుంబ సభ్యులు చుట్టు పక్కల, బైక్ షెడ్డు వద్ద వాకబు చేసినా అతని ఆచూకీ తెలియ రాలేదు. రెండు నెలల క్రితమే చేతికి గాయమైందని చికిత్స పొందిన హాజీ ఇంటి వద్దనే ఉంటున్నాడని అతని కుమారుడు ఇమ్రాన్ ఇచ్చిన ఫిర్యాదు మేరకు పోలీసులు కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేస్తున్నారు.